# తానొకటి తలిస్తే....

మె. యు. చౌ

జినగల్ లీసింగ్ యువకుడుగా ఉన్న రోజులలో, 'హు వో' పర్వతాలలో వేటాడుతూ ఉండేవాడు. లీసింగ్ రూపవంతుడు, పొడగరి. అందరితో స్నేహభావంతో మెలిగేవాడు. అందుకని అందరూ అతనిని ప్రేమతో చూచేవారు. ఒక్కొక్కసారి ఎప్పుడయినా అతడు వేటలోమునిగి, పట్టణానికి తిరిగివెళ్ళలేకపోతే , ఆ పర్వతాల సమీపంలో ఉన్న ఒకగ్రామ పెద్ద అతనికి సంతుష్టికరమైన భోజనం, పడక సౌకర్యాలు ఏర్పాటు చేసేవాడు. ఆవిధంగా వారిద్దరూ ఆప్త మిత్రులయినారు.

ఒకరోజున వేటాడుతూ ఉండగా లీ ఒకపెద్ద లేళ్ళమంద జాడలను చూచాడు. లీ, మంచిగుఱ్ఱపురౌతు. ఆ లేళ్ళజాడనుబట్టి అతడు మిట్ట పల్లాల్ని దాటుకుంటూ త్వరితంగా వెళ్తున్నాడు. అప్పుడప్పుడు పొరపాటున గొఱ్ఱెలజాడలనుపట్టి దారితప్పి పోసాగాడు. అయిదువందల గజాల దూరంలో ఏమి కదులుతున్నా అతడుచూడగలడు. కాని ఆనాడు ఆ లేళ్లుఎలాగో అతనిదృష్టిపథంనుంచి తప్పించుకొని పోయినాయి. అయితే లక్ష్యంసాధించకుండా మధ్యలో విడిచేరకంకాదు కనుకపర్వతం తర్వాత పర్వతం దాటుతూ లీ ముందుకు పోతూనే ఉన్నాడు. నాలుగుప్రక్కలా బాగా చీకటి అలుముకున్నది. చివరికి లీ విసుగుపుట్టి వెనుతిరిగిపోదామని అనుకున్నాడు. కాని తీరాచూస్తే అతడున్న ప్రదేశం అపరిచితమైనది కావటంచేత తిరిగి వెళ్ళటం సాధ్యపడలేదు. లీసింగుకు ఏమిచేయాలో తోచలేదు. ఇంతలో ఎదురుగా ఉన్న ఒక పర్వత శిఖరమునుండి ఒకదీపం ప్రకాశిస్తూఉండటం అతడు గమనించాడు. అతనికి ఉత్సాహం కలిగింది. అరగంటసేపటిలో అక్కడికి చేరుకోవచ్చు, ఆనాటికి అక్కడ బస చేయవచ్చునని లీఅనుకున్నాడు. ఆదిశగా ప్రయాణించి అతడు తెల్లని ఉన్నత ప్రాకారందాటి ఎఱ్ఱని ద్వారంగల ఒకభవనం ముందుకు చేరుకున్నాడు. తలుపు తట్టి నిలబడ్డాడు.

కొంతసేపయిన తరువాత, ఒక భృత్యుడువచ్చి ద్వారం తెరిచాడు. లీ తనసంగతిచెప్పి,ఆరాత్రికి ఆతిథ్యం ఇవ్వవలసిందని ప్రార్థించాడు. ఆ భృత్యుడు లోనికివెళ్ళి యజమానురాలితో చెప్పి, ఆమె అనుమతి తీసుకొని లీని లోపలికి తీసుకొనివెళ్లాడు. వెళ్తూ అతడు ఇలాచెప్పాడు. "భవనంలో మా యజమానురాలు ఒక్కర్తేఉన్నారు. మరెవ్వరూ లేరు. మొదట ఆమె మీరు లోనికిరావటానికి సమ్మతించలేదు. కాని మీరు దారితప్పిపోయినట్లు తెలిసిన పిదప తమకీరాత్రికి ఒకగది ప్రత్యేకించటానికి ఒప్పుకున్నారు."

లీని అతడు అందంగా అలంకరించబడిన ఒకహాలులోకి తీసుకువెళ్లాడు. మణిదీపాలు బంగారు పాత్రలు మొదలయిన వాటితో ఆహాలు చాలా సుందరంగా ఉన్నది. లీ అక్కడికి వెళ్ళగానే ఒక పరిచారిక వచ్చి యజమానురాలు వస్తున్నదని తెలియపరిచింది.

యజమానురాలు నిరాడంబరమైన దుస్తులువేసుకొని ఉన్నది ఆమెలో రాజసం మూర్తీభవించింది. లీ ఆమెకు నమస్కరించి, పిలవకుండానే తాను వచ్చినందుకు క్షమాపణ చెప్పుకున్నాడు. ఆమె ఇలాచెప్పింది" ఈ రాత్రి నా కుమారులు ఇంటివద్దలేరు. సాధారణంగా ఇటువంటి సమయంలో నేను అతిథులను స్వీకరించను. కాని దారితప్పివచ్చిన మిమ్మల్ని ఈ రాత్రి సమయంలో విడిచిపెట్టటానికి నాకు మనసొప్పలేదు." త్రాసులో వేసి తూచినట్లు, నిశ్చలతతో ఈ రెండు ముక్కలు ఆమెచెప్పింది. ఆమె ఆజ్ఞ ప్రకారం లీకిశ్రేష్ఠమైన భోజనం వడ్డించారు. భోజనమైనపిమ్మట, లీ ఆమెకు కృతజ్ఞత తెలిపాడు. ఆమె ప్రత్యభివందనంచేసి మృదువుగా అతనితోఅన్నది. "మాభవనంలో రాత్రిపూటబాగాగోలగాఉంటుంది.

మీకేమీ అభ్యంతరం లేదనుకుంటాను."

లీఆశ్చర్యంతో కళ్లు పెద్దవిచేసి చూశాడు. ఆమె ఇంకా ఇలా చెప్పింది. "నా కుమారులు మామూలుగా అర్థరాత్రివేళవస్తారు. చాలా గోలచేస్తారు. మీరు అనవసరంగా భయపడకుండా ఉండటానికి గాను మీకు ముందుగా చెప్పుతున్నాను." లీకి ఆమె కుమారులనుగురించి అడగాలనిపించినా, అంతగా తనకు సంబంధించని వాటిని గురించి అడగరాదని అనుకున్నాడు.

లీ తనకు ఇచ్చినగదిలో వెచ్చగా పడుకున్నాడు. వేటాడి, అలసిపోయిఉన్న అతనికి అలాపడుకుంటే ఎంతోహాయిఅనిపించింది. కానిమనుష్యులు ఎవ్వరూలేని అక్కడ తనకు ఆతిథ్యము ఇచ్చినవారు ఎందుకు ఉన్నారో, వారెవరో, అర్థరాత్రివేళ వచ్చిగోలచేసే ఆమెకొడుకులు ఎలా ఉంటారో తెలుసుకోవాలని అతనికి చాలా కుతూహలం కలిగింది. అందుచేత, ఆహారం కొరకు పొంచి ఉన్న వన్యమృగంలాగా నిశ్చలంగా పండుకొని ఏంజరుగుతుందో చూడాలని ఆలోచిస్తున్నాడు.

అర్థరాత్రివేళ ఎవరో తలుపు గట్టిగాకొట్టిన చప్పుడైంది. నౌకరు తలుపుతీసి ఎవరితోనో మాట్లాడి యజమానురాలి వద్దకు వచ్చాడు. "అమ్మగారూ! ఇప్పుడు ఒకవార్తాహారుడు ఈ లేఖతీసుకొని వచ్చాడు. ఈపర్వత పరిసరాలచుట్టు ప్రక్కల ఏడుమైళ్ళవరకు వర్షంకురిపించ వలసిందిగా పెద్దబాబుగారికి ఆజ్ఞ అయింది. తెల్లవారేసరికి వర్షంఆగిపోవాలి. పంటలు పాడయిపోకూడదు."

యజమానురాలు భయపడింది. "నేనిప్పుడేమి చేయగలను? కొడుకులిద్దరూ చాలాదూరంలో ఉన్నారు. వారికి కబురు అందేవ్యవధానం కూడా ఉండదు."

"అతిథిని పంపకూడదా? అతడు మంచిబలవంతుడు. వేటగాడు, బాగా స్వారీచేయగలడు." అని పరిచారిక చెప్పింది. ఆమె సంతోషంతో లీ వద్దకు వచ్చిపిలిచింది. లీ తనగది విడిచి చావడిలోనికి వచ్చాడు. యజమానురాలు ఆత్రుతతో అతనికి వివరించింది. "మీరిప్పుడు బసచేసినది భూతాల నివాసం. తెల్లవారేవరకు వర్షం కురిపించ వలసిందిగా స్వర్గంనుండి ఆజ్ఞ వచ్చింది. నాకుమారులిద్దరూ కార్యాంతరంపైన వేలకొద్దిమైళ్లలో ఉన్నారు. వారికి వార్తపంపే వ్యవధిలేదు. మీరుపూనుకొని మమ్మల్ని గట్టెక్కించకపోతే నా కుమారులు శిక్షా పాత్రులవుతారు."

ఈ అపూర్వమైన ప్రార్థన వినేసరికి లీ ఆశ్చర్యభరితుడైనాడు. యజమానురాలు జీనువేసిన ఒక నల్లని గుఱ్ఱాన్ని తెప్పించింది. వర్షపు నీరు ఉన్న ఒక చిన్న సీసా ఇచ్చింది. ఆ సీసాను జీనుముందు కట్టమని చెప్పింది. "ఇది ఆకాశంలో విహరించే గుఱ్ఱం. కళ్ళాన్ని వదులుగా పుచ్చుకొని, దాని ఇష్టంవచ్చిన చోటికి వెళ్ళనివ్వండి. ఎక్కడికి వెళ్ళాలో దానికి తెలుసు. అది గిట్టలు కదిలించి తట్టినప్పుడెల్లా మీరు ఈ సీసా తీసుకొని ఒక చుక్క దాని జూలుమీద చల్లండి. కాని ఎక్కువగా పడకుండా మాత్రం జాగ్రత్తగా చూడండి."

లీ ఆ అశ్వాన్ని అధిరోహించి బయలుదేరాడు. దాని నిబ్బరానికి వేగానికి ఆశ్చర్యం కలిగింది అతనికి. ఆ గుఱ్ఱం అతనిని మేఘాలలో తీసుకొని పోతున్నది. శీతలవాయువులు ప్రసరిస్తున్నాయి. యజమానురాలు చెప్పినట్లు చేయసాగాడు. కొద్దిసేపట్లో అతడు మామూలుగా రాత్రిపూట ఆగుతూఉండే గ్రామానికి వచ్చాడు. లీ ఇలా ఆలోచించాడు. "ఆ గ్రామపెద్ద నాకు ఎంతో సహాయం చేస్తున్నాడు. వాళ్ల పైరులు నిన్నచూస్తే ఎండిపోయి ఉన్నాయి. కంకులన్నీ కాటుకేసి పోయినాయి. నాచేతిలో ఇప్పుడు వర్షం కురిపించేశక్తి ఉన్నది కనుక బాగా వర్షం కురిపిస్తాను." లీ అక్కడ ఇరవై చుక్కలు చిలకరించి అక్కడ కుంభవృష్టి కురవటంచూసి సంతోషించాడు. తన పనిపూర్తి కాగానే అతడు భూత నివాసానికి చేరుకున్నాడు. అతడు వెళ్ళేసరికి, చావడిలో కూర్చొని యజమానురాలు విలపిస్తున్నది. "అయ్యో! ఎంత ఘోరమైన అపరాధం చేశారు మీరు? నేను చెప్పినట్లు కాక సీసాలో సగం పైగానీరు చల్లి వచ్చినట్లున్నారు. మీరు ఒకచుక్క నీరుచల్లితే భూమిపై ఒకఅడుగు వర్షంకురుస్తుంది. ఒకరాత్రి, 20 అడుగుల వర్షంపడితే ఆగ్రామం ఈ పాటికివరదలలో కొట్టుకొని పోయి ఉంటుంది. ఎంతనష్టం? స్వర్గానికి దీనినిగురించి ఫిర్యాదు వెళ్లుతుంది. ఈ విపత్తుకి నా కుమారులు బాధ్యత వహించవలసి ఉంటుంది." లీకి చాలా సిగ్గువేసింది. కానిఇప్పుడు ఎంత అనుకున్నంతమాత్రం ఏమి ప్రయోజనం ఉంటుంది? ఆమెఇంకా

(49-వ పేజీ చూడండి)

# తానొకటి తలిస్తే....

(47-వ పేజీ తరువాయి)

ఇలాఅన్నది. "మీకు ఈసంగతి తెలియక పోవటంవలన పొరపాటు చేశారు. కాని నా కుమారులు భవనానికిచేరుకునేవేళకు, మీరిక్కడ ఉండటం మీకు మంచిదికాదు. తక్షణం ఇక్కడినుంచి వెళ్లిపొండి."

లీ అక్కడనుంచి వెళ్ళిపోవటానికి సంసిద్ధమైనాడు. అప్పటికే అరుణోదయం కావస్తున్నది. అక్కడనుంచి అంత తేలికగా బయటపడుతున్నందుకు అతడు సంతోషించాడు. వెళ్ళబోయేముందు భవనం యజమానురాలు, అతనివద్దకువచ్చి ఆరాత్రి అతనికి శ్రమ ఇచ్చినందుకు ప్రతిఫలం ఇవ్వదలిచినట్లు చెప్పింది. లీ ఆశ్చర్య పోయినాడు. ఆమెతో ఇద్దరుసేవకులు ఉన్నారు. వారినిద్దరినీకాని, ఒకరినిగాని ఎన్నుకోమని ఆమెకోరింది. ఒకడు సాధువుగా కరుణా మయుడుగా కనిపించాడు. మరొకడుదృఢంగా, భయంకరంగా ఉన్నాడు. ఆరాత్రి తానుపొందిన అనుభవానికి చిహ్నంగా ఒకసేవకుని తీసుకోవాలని నిశ్చయించిన లీ దృఢకాయునే ఎన్నుకున్నాడు. తనకు వేటలో అతడు మిక్కిలిగా సహాయ పడతాడని అతడు ఆశించాడు.

ఆమెవద్ద సెలవుతీసుకొని లీ బయలుదేరాడు. మళ్లీఒకసారి భవనంవంకచూద్దామని అతడు వెనుదిరిగాడు. కాని అదిఅప్పుడే అంతర్ధానమైంది. సేవకుడూ అంతర్ధానమైనాడు.

లీ ఒంటరిగా త్రోవ పట్టాడు. రాత్రితాను కురిపించిన వర్షఫలితంగా మునిగిపోయినగ్రామం కనిపించింది.

తరవాత కొన్నాళ్ళకు లీ సేనానాయకుడైనాడు. చక్రవర్తి కొలువులో అతడుచాలా కాలం సేవచేశాడుకాని ఎన్నడూ అతడురాజకీయంగా ఉన్నతోద్యోగికాలేకపోయినాడు. కారణం సాధువు, విజ్ఞానిఅయిన సేవకుని కోరుకోకపోవటమే. టంగ్‌క్వాన్ కనుమల పశ్చిమాన్నుంచి మంచిజనరల్, తూర్పు దిక్కునుంచి మంచి ప్రధానివస్తాడని సామెత కూడాఉన్నది. లీ కనుక ఆ సేవకులిద్దరినీ తీసుకొని వెళ్ళినట్లయితే ఉన్నతపదవి పొందేవాడు.

(లిన్యుటాంగ్ ఇంగ్లీషులోకి అనువదించిన చైనీస్ కథకు అనువాదం)

★

## గ్రంథ సమీక్ష

### కథలు రాయడ మెలా?

రచన:— కొంతి కృష్ణమూర్తి; ప్రచురణ: యశోధర ప్రచురణలు, హనుమకొండ, వరంగల్; వెల 1-8-0.

రచనకు ఆకర్షవంతమైన శీర్షిక పెట్టాలని ఈగ్రంథంలో రచయిత ఒక సూచన చేశారు ఈ సూచనకు ఈ గ్రంథ నామం కంటే మంచి ఉదాహరణ దొరకదు. ప్రస్తుతం విద్యావంతులైన యువకులలో కథలు వ్రాయాలనే కుతూహలం ఎంత ప్రబలంగా వున్నదో పత్రికలవారికి బాగా విదితమైన విషయమే. కేవలం ఉత్సాహమే తోడుగా, ఒక నిర్దిష్టమార్గం అంటూ ఏమీలేని సముద్రంలో ప్రయాణానికి బయలుదేరే సాహసికులవలెనే ఈ ఉత్సాహవంతులందరూ కథారచనకుఉపక్రమిస్తున్నారు. వీరికి ఈ పుస్తకం పేరుమాడగానే ప్రాణం లేచివస్తుందనడానికి సందేహమేమీ లేదు. అంతవరకూ అగమ్యగోచరంగా కనిపించిన సముద్రానికి ఎవరో సజ్జనుడు శుభ్రంగా నౌకామార్గాలూ వగైరా వేసి చక్కని పటం తయారు చేసి సముద్రయానానికి కావలసిన పరికరాలు సర్వమూ రెడీ మేడ్‌గా అందజేసినట్లు భావిస్తారు. ఈపుస్తకం ప్రారంభ రచయితలకోసమే ప్రత్యేకంగా వ్రాయబడింది

కాగితంమీద రెండు వేపులా వ్రాయవచ్చునా లేదా, పత్రికలకు కథఎలా పంపించాలి వగైరా అతి సాధారణ విషయాల దగ్గిర్నించి కథాసాహిత్య ప్రయోజనం దాకా అన్ని విషయాలూ వివరంగా రచయిత వ్రాశారు ఈ పుస్తకం చదివినవారు వెంటనే మంచి మంచి కథలుగాని కనీసం 'ఏవోకథలు' గాని వ్రాస్తారనే గ్యారంటీ లేకపోయినా, కథారచనను గూర్చి చాలమందికివుండే సందేహాలు కొంతవరకు నివృత్తి అవుతాయని చెప్పవచ్చు.

### శ్రీ వేంకటేశ స్తోత్రము:—

ఆంధ్రీకరణము; గ్రంథకర్త: కె. నారాయణరావు; ప్రకాశకులు: జయలక్ష్మీ అండ్ కంపెనీ, ట్రంకురోడ్డు, నెల్లూరు.

### కొత్త పత్రిక

### జ్యోత్స్న:—

సారస్వత మాసపత్రిక; మేనేజింగ్ ఎడిటర్: ఆర్. రామకృష్ణ; విడిసంచిక 0-6-0; సంవత్సరచందా 4-0-0. కరీంనగర్ జిల్లా, జగిత్యాలనుండి వెలువడిన ఈ పత్రిక మొదటి సంచిక (మార్చి, 55)మా కార్యాలయమునకు చేరినది. దాశరథి, సురమౌళి, దివాకర్ల వేంకటావధాని మున్నగువారి రచనలీ సంచికలో ఉన్నాయి.

### అక్షరసుందరి:—

భావకవిత; రచయిత: ఎస్. ఆర్. ఎస్. అయాచిత్; ప్రతులకు: ఆంధ్ర విశ్వసాహిత్య పరిషత్, పూర్ణానందం పేట, విజయవాడ - 2. వెల.0-12-0.

### బాలలబొమ్మల భారతము:—

గ్రంథకర్త: బూరెల సత్యనారాయణ మూర్తి; చిత్రకర్త: బి. పి. రాజా. ప్రతులు దొరుకుచోటు: సి. ఎన్. సెట్టి, చార్ కమాన్, హైదరాబాద్-2; వెల 1-8-0. మహాభారత కథను పిల్లలకు సులభగ్రాహ్యంగా ఉండే వచనంలో బొమ్మల సహాయంతో తెలిపే గ్రంథం. ముద్రణ, ముఖచిత్రాలు వగైరా బాగున్నాయి.

### బంగారు దీవి:—

రాబర్ట్ లూయీ స్టీవెన్సన్ నవల "ట్రెజర్ ఐలెండు" కు సంగ్రహానువాదం; అనువాదకుడు: విద్యాపతి; వెల 1-4-0; ప్రచురణ: సి. ఎన్. సెట్టి, హైదరాబాదు.

★